క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: నాచారం 33/11కేవీ టెక్‌పార్క్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా ఆదివారం మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని నాచారం విద్యుత్ ఏఈ నాగరాజు తెలిపారు. నాచారం పారిశ్రామికవాడలోని రోడ్డు నెంబర్ 12,13,14,15,18, జీవీకే లైన్, ఏపీ ఫుడ్స్ ఏరియా, షాహీఎక్స్‌పోర్ట్స్, రహేజా అపార్ట్‌మెంట్స్, క్లాసిక్ టైల్స్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

మహాసభలకు ఆహ్వానం



ఎమ్మెల్సీ కోదండరాంకు ఆహ్వానం అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కుషాయిగూడ: తెలంగాణ ప్రింట్ మీడియా డిస్ట్రిబ్యూషన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 15న నిర్వహించ తలపెట్టిన రాష్ట్ర రెండో మహాసభలకు హాజరు కావాలని అసోసియేషన్ ప్రతినిధులు శనివారం ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను ఆహ్వానించారు. మౌలాలి కలర్స్ ఫంక్షన్‌హాల్‌లో జరిగే ఈ సదస్సులో హాకర్స్ సమస్యల సాధనకు రూపకల్పన చేయనున్నట్లు అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటించారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సత్యం, రవి, విజ్జు, దశరథ్, శ్రీను, నరేష్ పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు..

అల్వాల్: అల్వాల్ సర్కిల్ పరిధిలోని పలు బేకరీల్లో ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేశారు. మచ్చబొల్లారంలోని ఓ బేకరీలో తనిఖీలు నిర్వహించగా అపరిశుభ్ర వాతావరణంతో పాటు కేక్‌లు తయారుచేసే ప్రాంతంలో బొద్దింకలు, ఎలుకలు తిరగడాన్ని గుర్తించారు. ఆహార పదార్థాలను నిల్వచేసిన డ్రమ్ములు సైతం అపరిశుభ్రంగా ఉన్నాయన్నారు. కాలం చెల్లిన కేసరి సిరప్, బటర్, ఫ్లేవర్ కాంపోండ్, పైన్ యాపిల్ ఫ్లేవర్, వెనిలా ఫ్లేవర్, కోకోనట్ పౌడర్‌ను సీజ్ చేశారు. రవాణా చేయడానికి ఉపయోగించే ఏడు చిల్లర్ వాహనాలకు లైసెన్స్ లేదని గుర్తించారు.

నర్సింగ్ విద్యార్థిని అదృశ్యం



వైష్ణవి

మల్కాజిగిరి: ఓ విద్యార్థిని అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. సీఫెల్ కాలనీకి చెందిన రేవంత్ కుమార్తె వైష్ణవి (18) గుంటూరు పిడుగురాళ్లలోని నర్సింగ్ కాలేజీలో ఫస్ట్ ఇయర్ చదువుతూ హాస్టల్‌లో ఉంటోంది. గత నెల 22న ఆమె తల్లి రాజ్యలక్ష్మి ఇంటికి తీసుకొచ్చింది. సంక్రాంతి తర్వాత తిరిగి కాలేజీకి వెళ్లాల్సి ఉండగా.. శనివారం వైష్ణవి కనిపించకపోవడంతో తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆహ్లాదాన్ని పంచుతున్న పార్కులు

ఆరోగ్యంపై దృష్టి సారిస్తున్న నగరవాసులు

గౌతంనగర్: నిత్యం ఎన్నో ఒత్తిళ్లతో క్షణం తీరిక లేకుండా జీవనం జీవనం గడుపుతున్న జంటనగరవాసులకు పార్కులు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఉదయం ఇంటి నుంచి బయలుదేరినప్పటి నుంచి ప్రజలను వాయు కాలుష్యం వెంటాడుతోంది. దీనికి తోడు వాహనాలు హారన్‌లు, తదితర చప్పుళ్ల ధ్వనులతో శబ్ద కాలుష్యం వెంటాడతంతో ఇబ్బంది పడుతున్నారు.

ఇరుకు గదుల్లో అవస్థలు..

ఆఫీసుల్లో గంటల తరబడి కంప్యూటర్ స్క్రీన్లపై పనిచేయడంతో పాటు మానసిక ప్రశాంతత కరువవుతుంది. ఇరుకు గదులు, అరకొర సౌకర్యాలు, వెంటిలేషన్ సరిగ్గా లేకపోవడంతో ప్రజలు రోగాల భారిన పడుతున్నారు.

సమయం లేక.. జిమ్‌లకు వెళ్లలేక..

నిత్యం బిజీగా గడుపుతున్న ఉద్యోగస్తులకు సమయం ఇటు సమయం లేక.. మరోవైపు రోడ్లు బిజీగా ఉండటంతో వాకింగ్ చేసే అవకాశం, ఆలోచన రెండూ లేకుండా పోతున్నాయి. చాలా చోట్ల ప్రైవేటు జిమ్‌లు అధిక మొత్తం వసూలు చేస్తుండటంతో అటు వైపు కన్నెత్తి చూడటం లేదు.

సుందరీకరించారు..

సమయం ఉన్నప్పుడల్లా కుటుంబసభ్యులతో కలిసి ఆహ్లాదం కోసం పార్కులకు వచ్చే వారితో పాటు



పచ్చదనంతో పార్కులోని లాన్



జ్యోతినగర్ పార్కులోని వాకింగ్ ట్రాక్

నిత్యం వాకింగ్ చేసేవారికి అనుకూలంగా ఉండేలా పార్కులను సుందరీకరించారు. దీనికి తోడు జ్యోతినగర్, గౌతంనగర్ పార్కులలో ఆహ్లాదం ఇచ్చే విధంగా సుందరీకరణ పనులను అధికారులు చేపట్టారు.

పిల్లలు, పెద్దలకు అనుకూలంగా..

ఈ పార్కుల్లో గౌతంనగర్‌కు చెందిన పలు కాలనీ వాసులు, వయో వృద్ధులు, చిన్నారులు, యువత అభివృద్ధి చేసిన పార్కులను సద్వినియోగం చేసుకుంటున్నారు.

సదుపాయాల కల్పన..

జ్యోతినగర్ కాలనీలోని ప్రధాన రహదారి పక్కన ఉన్న స్థలంలో పార్కు, గౌతంనగర్ కాలనీలోని చాచానెహ్రూ పార్కుల్లో ఆహ్లాదం ఇచ్చే విధంగా జీహెచ్ఎంసీ అధికారులు అన్ని రకాల సదుపాయాలను కల్పించారు. ఈ పార్కులో ఉదయం, సాయంత్రం వేళల్లో సీనియర్ సిటిజన్లు, చిన్నారులు, మహిళలు వ్యాయామం చేస్తున్నారు. ఆహ్లాదం, ఆరోగ్యం లభిస్తుందని చెబుతున్నారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి



సీసీరోడ్డు పనుల శంకుస్థాపనలో మేయర్



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: దశల వారీగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. 15వ డివిజన్ పరిధిలో సీసీరోడ్డు పనులకు ఆయన శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పనులను త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, నేతలు పులకండ్ల జంగారెడ్డి, కొత్త విక్రమ్‌గౌడ్ కాలనీవాసులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

బోడుప్పల్: విద్యార్థులకు క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. చెంగిచర్ల క్రాంతికాలనీలోని బీఎంఆర్‌ఎస్ పాఠశాలలో శనివారం నిర్వహించిన కబడ్డీ ప్రీమియర్ లీగ్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పిల్లలకు చిన్నతనం నుంచి చదువుతో పాటు క్రీడల్లో ఆసక్తి కలిగేలా పాఠశాల వాతావరణం ఉండాలని సూచించారు. క్రీడల్లో రాణిస్తూ రాష్ట్రం, దేశం గర్వించస్థాయికి తీసుకెళ్లాలన్నారు. ఈ పోటీల్లో 6 కబడ్డీ జట్లు పాల్గొన్నట్లు వివరించారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతికిశోర్‌గౌడ్, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ జైపాల్‌రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ కొత్త లక్ష్మీరవిగౌడ్, కార్పొరేటర్లు బింగి జంగయ్య యాదవ్, సామల పవన్‌రెడ్డి, కుంభం కిరణ్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

పనిచేసే వారికే పదవులు !



అల్వాల్: బీజేపీలో పనిచేసే వారికే పదవులు అప్పగిస్తామని బీజేపీ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు రవికుమార్ అన్నారు. శనివారం పెంటారెడ్డి గార్డెన్స్‌లో మచ్చబొల్లారం డివిజన్ అధ్యక్ష పదవికి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తూ.. ఆసక్తి కలిగిన నేతల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ..పార్టీలో నాయకత్వం కోసం పోటీ ఉందని, పోటీలో ఉన్న వారిలో సమర్థులను ఎంపిక చేస్తామన్నారు. 91 మంది క్రియాశీలక సభ్యులు అధ్యక్షుడిపై అభిప్రాయాలను వ్యక్తం చేశారన్నారు. పోటీలో పద్మిని, అజయ్‌రెడ్డి, మంద విజయ్, వినయ్‌శంకర్, యుగంధర్, కరుణశ్రీ, మహేష్ రాజ్ ఉన్నారన్నారు.

సీపీ ఆకస్మిక పర్యటన



రికార్డులు పరిశీలించిన సీపీ సుధీర్‌బాబు

కుషాయిగూడ: కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌ను రాచకొండ సీపీ సుధీర్‌బాబు శనివారం ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్‌లోని పలు విభాగాల పనితీరును ఆయన పరిశీలించారు. కేసుల పురోగతిపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. న్యాయం కోసం స్టేషన్‌కు వచ్చే వారికి పోలీస్ శాఖపై ప్రజల్లో విశ్వాసాన్ని పెంచాలన్నారు.

సన్మానం



సన్మానిస్తున్న చైర్మన్ రాజాగోపాల్ సంచార్

అల్వాల్: విధి నిర్వహణలో అంకితభావం గుర్తింపునిస్తుందని దేవుని అల్వాల్‌లోని బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ వంశపారపర్య చైర్మన్ రాజాగోపాల్ సంచార్, ఈవో మఠం వీరేశం అన్నారు. ఆలయంలో పనిచేసి పదవీవిరమణ పొందిన శ్యామలను శనివారం ఘనంగా సన్మానించారు. దేవుడి సన్నిధిలో సేవ చేయాలంటే అదృష్టం ఉండాలని అలాంటి అదృష్టం శ్యామలకు దక్కిందన్నారు. వెంకట్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, అర్చకులు రఘు, వంశీ ఆలయ మాజీ ధర్మకర్తలు వెంకటరామిరెడ్డి, పద్మ, రాజు, నాగరాజు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రవిచంద్రన్

అల్వాల్: మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షుడు కె.రవిచంద్రన్ డిమాండ్ చేశారు. యాదవ్ కమ్యూనిటీహాల్‌లో జరిగిన అల్వాల్ సర్కిల్ యూనియన్ సర్వసభ్య సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ పర్మనెంట్ చేయాలని కోరారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఏసురత్నం, అల్వాల్ సర్కిల్ సంఘం గౌరవ అధ్యక్షుడు డీఎస్ శేఖర్, సలహాదారుడు మహేందర్, కార్మికులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: మారుతీనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్కులో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానిక కార్పొరేటర్ శ్రవణ్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. కాలనీలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమిని పరిరక్షించి ఇటీవలే చిల్డ్రన్స్ పార్కు ఏర్పాటు చేశామని, పార్కులో ల్యాండ్‌స్కేపింగ్ పనులు పూర్తయ్యాయన్నారు. లైటింగ్, పార్కు చుట్టూ చిన్నారులకు ఆసక్తి కలిగించేలా బొమ్మలను వేయిస్తామన్నారు. హార్టికల్చర్ సూపర్‌వైజర్ రాజు, జైకృష్ణ, హరిగౌడ్, రమేష్, యాదమ్మ పాల్గొన్నారు.

థీమ్ పార్కు పనుల పరిశీలన

మల్లాపూర్: రూ.4 కోట్ల నిధులతో ఏర్పాటు చేసిన థీమ్ పార్కును శనివారం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ అనంతరం పార్కును ప్రారంభించి అందుబాటులోకి తీసుకురానున్నట్లు వివరించారు. మిగిలిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఏఈ స్రవంతి, స్థానిక నేతలు వాసుగౌడ్, పీఆర్.ప్రవీణ్, పద్మారెడ్డి, దయాకర్‌రెడ్డి, రఘు, ప్రభాకర్‌రెడ్డి, నర్సింగ్‌రావు, ప్రవీణ్, రఘు తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి

కేలండర్ల ఆవిష్కరణ

మౌలాలి: ముదిరాజ్ మహాసభ కేలండర్‌ను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆవిష్కరించారు. మల్కాజిగిరి మండల ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు సాంబరాజుముదిరాజ్, ముఖ్య సలహాదారుడు గద్వాల్ వంశీ, దండు ప్రసాద్‌బాబు, యాదగిరి, భిక్షపతి, రవి, రంజిత్, అరుణ్ పాల్గొన్నారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

జేజీఆర్ స్కూల్‌లో..

బోడుప్పల్: బృందావన్ కాలనీలోని జేజీఆర్ ఉన్నత పాఠశాలలో కేలండర్‌ను శనివారం విద్యార్థులతో పాఠశాల నిర్వాహకులు ఆవిష్కరించారు. స్కూల్ కరస్పాండెంట్ గంగరాజు, ఇన్‌చార్జి విజయకుమారి విద్యార్థులకు కేలండర్‌ను అందజేశారు.



చైనా మాంజాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు

మల్కాజిగిరి: చైనా మాంజాను విక్రయించిన దుకాణదారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని నేరెడ్‌మెట్ ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్ హెచ్చరించారు. శనివారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గాలిపటాలు విక్రయిస్తున్న దుకాణాలను తనిఖీ చేశారు. ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. చైనా మాంజాను ప్రభుత్వం నిషేధించిందని, దానిని ఉపయోగించడం వల్ల పక్షులకే కాకుండా మనుషులకు కూడా ప్రమాదాలు జరుగుతాయన్నారు. ఎట్టి పరిస్థితుల్లో విక్రయించకూడదని స్పష్టం చేశారు.

సంతోషిమా చౌరస్తాలో..

మౌలాలి : వినాయక్‌నగర్, సంతోషిమా చౌరస్తా ఆవరణలోని దుకాణాలను ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్ పరిశీలించారు. చైనా మాంజా వాడటంతో పక్షులు, మనుషులకు ప్రమాదమని, వీటిని ఉపయోగించకూడదని సూచించారు.



దుకాణాల్లో తనిఖీలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్

ప్రజా సమస్యలు పరిష్కరించండి




జెడ్సీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ శాంతి

మల్లాపూర్: నాచారం డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని శనివారం ఈస్ట్ జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్ పాటిల్‌కు నాచారం కార్పొరేటర్ శాంతి సాయిజెన్‌శేఖర్ వినతిపత్రం అందజేశారు. నాచారంలో పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. హెచ్ఎంటీనగర్, పటేల్‌కుంట చెరువులో గుర్రపుడెక్క విపరీతంగా పెరిగి, దోమలు పెరిగిపోయాయని పేర్కొన్నారు. హెచ్ఎంటీనగర్ చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు సాయిజెన్‌శేఖర్, కట్ట బుచ్చన్నగౌడ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి..

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



ఆంథోనీ (ఫైల్)

కుషాయిగూడ: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి ఆసుపత్రిలో మృతిచెందిన ఘటన శనివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం.. తిరుమలగిరిలో నివాసం ఉండే ఎం. ఆంథోనీ (58) ఏఎస్‌రావునగర్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. గత నెల 26న విధులకు హాజరయ్యేందుకు వచ్చిన అతడు ఏఎస్‌రావునగర్ పిస్తాహౌజ్ వద్ద రోడ్డు దాటుతుండగా అతివేగంతో దూసుకొచ్చిన (టీఎస్08 యూ3277) ట్రాలీ ఆటో ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడు గాంధీ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



నృత్య ప్రదర్శనతో కళాకారులు

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో వరనాథపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా వీణ అయ్యార్ భరత కళాక్షేత్రం శిష్యం బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పూర్వరంగం, పుష్పాంజలి, తిల్లాన, తరంగం తదితర అంశాలను కాశిక, తన్వి, లావణ్య, సాన్విక, శ్రీనిధి, గగన, హరిణి, కీర్తన, రిత్విక, మౌనిక, సాయి మానస్వినిలు ప్రదర్శించారు.

వినియోగదారులు మెచ్చిన 'ఏ వన్ టీ'



మల్కాజిగిరి కొత్త ఔట్‌లెట్‌లో వినియోగదారులు

నల్లకుంట: ఏ వన్ టీ కంపెనీ 15వ బ్రాంచ్‌ను కంపెనీ డైరెక్టర్ ఎంఏ గఫూర్ పటేల్ మల్కాజిగిరిలో ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. 1977లో తొలి స్టోర్‌ను ప్రారంభించి, వినియోగదారుల మన్ననలతో పొందుతూ.. అంచెలంచెలుగా ఎదుగుతున్నామన్నారు. ఇప్పటికే నగరంలో 14 ప్రాంతాల్లో ఔట్‌లెట్లను ప్రారంభించామని తెలిపారు. కంపెనీ ప్రతినిధులు జాకీర్ పటేల్, జాకీ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతీకారంతోనే హత్య..

- 24 గంటల్లో ఛేదించిన పోలీసులు
- ముగ్గురు నిందితుల రిమాండ్

ఉప్పల్: రామంతాపూర్ బాలకృష్ణానగర్ మూసీ ఒడ్డున శుక్రవారం జరిగిన హత్యకు కారణమైన ముగ్గురు నిందితులను ఉప్పల్ పోలీసులు 24 గంటలు గడవకముందే అదుపులోకి తీసుకున్నారు. తన పెద్ద నాన్నను చంపిన కక్షతోనే నబీని హత్య చేసినట్లు ప్రధాన నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. సీఐ ఎలక్షన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. జూన్ 2023లో జాకీర్ హుస్సేన్ అనే వ్యక్తిని వ్యక్తి గత కారణాలతో మహమ్మద్ నబీ అంబర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో హత్య చేసి జైలుకు వెళ్లాడు. మృతుడి తమ్ముడి కుమారుడు మహమ్మద్ అబ్దుల్ రెహమాన్ (22) తన పెద్దనాన్న హత్యకు ప్రతీకారం తీర్చుకోవాలని నిర్ణయించుకుని, నబీ జైలు నుంచి రాగానే స్నేహితులైన అంబర్‌పేట బాపునగర్‌కు చెందిన విఠల్ నర్సింగరావు(20), చెన్నారెడ్డినగర్‌కు చెందిన మహమ్మద్ సోహెబ్ ఖాద్రీ(22)తో కలిసి పథకం వేశాడు. శుక్రవారం సాయంత్రం నబీతో మాటలు కలిపి బలవంతంగా ఆక్టీవాపై కేసీఆర్‌నగర్ మూసీ ఒడ్డు వద్దకు తీసుకెళ్లారు. కత్తితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. అప్పటికే శరీరంపై పలుచోట్ల 18 కత్తిపోట్లు పడ్డాయి. అనంతరం పెద్ద బండరాయితో తలపై మోదగా నబీ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతిచెందాడని నిర్ధారించుకున్న తర్వాతే నిందితులు పరారయ్యారని పోలీసులు తెలిపారు. సీసీ ఫుటేజీ ఆధారంగా అంబర్‌పేట్‌లో నిందితులను అదుపులో తీసుకున్నామన్నారు. శనివారం రిమాండ్‌కు తరలించామన్నారు.

ప్రత్యేక ప్రార్థనలు



కుషాయిగూడ: చర్లపల్లి, బీఎన్‌రెడ్డినగర్ కాలనీలోని హజరత్ మగ్దూం మొహిద్దిన్‌షాబాబా మసీదులో నిర్వహించిన ఉర్సు ఉత్సవాల్లో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

ఆక్రమణల ఫిర్యాదుపై..

స్పందించిన తహసీల్దార్

మల్లాపూర్: కమాలాయిబాయినగర్ కాలనీలో తహసీల్దార్ వాణిరెడ్డి, సర్వేయర్ వెంకటేలు పర్యటించారు. ఆగ్రో ఇండస్ట్రీస్ స్థలం కబ్జాకు గురైనట్లు ఇండస్ట్రీస్ ప్రతినిధి వెంకన్న తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఆమె సరిహద్దులను పరిశీలించారు. త్వరలోనే హైడ్రా అధికారులు అక్రమ నిర్మాణాలను తొలగిస్తారని సమాచారం.

గ్రామీణ ప్రాంతాలకు వైద్య సేవలు అందాలి

రామంతాపూర్ : జై సూర్య పొట్టి శ్రీరాములు ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కళాశాల 57వ వార్షికోత్సవ వేడుకలు శనివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సీహెచ్ఎస్.రాజకుమారి హాజరై మాట్లాడారు. విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల్లో కూడా సేవలందిస్తే వైద్య చికిత్సలు చేయడంలో మంచి అనుభవం వస్తుందని, దుష్ఫలితాలు లేని హోమియో వైద్య విధానం ప్రస్తుతం ప్రాచుర్యం పొందుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లింగరాజు, డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ పార్థసారథి, డాక్టర్ కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

